క్రాస్‌వర్డ్ పజిల్

"శ్మశానం ఎక్కడుందో తెలుసా?"

లంచ్ అవర్లో వెంకట్రావు నడిగాడు చక్రవర్తి. వెంకట్రావు కూడ తనుంటున్న విజయనగర్ కాలనీలోనే వుంటున్నాడు.

వెంకట్రావు తెల్లబోయేడు. గోల్కొండ ఎక్కడుంది? పురానాపూల్ ఎక్కడ? సరూర్ నగర్ ఎక్కడుందని అడుగుతారు గాని శ్మశానంగూర్చి అతనెన్నప్పుడూ ఎవ్వరూ అడగలేదు. అతను హైద్రాబాదులో పదేళ్ళనుంచి వుంటున్నా తమ కాలనీకి దగ్గర్లో శ్మశానం ఎక్కడుందో తెలియదు.

"నాకూ సరిగ్గా తెలియదు చక్రవర్తీ! .... కైలాష్‌నగర్ శ్మశానమేదో వుందనుకుంటాను.... మా నాన్న నడిగి చెబుతాను... అయినా శ్మశానం గూర్చి ఎందుకడిగేవ్?"

కొన్ని క్షణాలు చెప్పడానికి సంకోచించాడు.

"మా అమ్మకు వొంట్లో బాగుండటంలేదు... ఇవాళో రేపో అన్నట్లుగా వుంది.... ఆ పరిస్థితే వస్తే ఎలా ఫేస్ చెయ్యాలో అర్థంకావడంలేదు.... నాకు తెల్సిన వాళ్ళెవరూ లేరు నువ్వు తప్పితే."

చక్రవర్తి కళ్ళనీళ్ళ పర్యంతమయ్యాడు. అన్ని విషయాలు చెప్పేడు వెంకట్రావుకి.

"బాధపడకు... మేమున్నాం గదా! అవసరమొస్తే నాకు కబురచెయ్యి.... మా నాన్నని, తమ్ముళ్ళని తీసుకువస్తాను."

చక్రవర్తికి ధైర్యం చెప్పి తన సెక్షన్‌వైపు వెళ్ళేడు వెంకట్రావ్.

క్యాంటిన్‌వైపు వెళ్లబుద్ధికాలేదు. చేతిలోకి పేపరు తీసుకున్నాడు.

.... జీవితంలో ఏ నిముషాన ఏం జరుగుతుందో ఎవ్వరూ ఊహించలేరు.... బంగ్లా బంధు ముజిబుర్ రహమాన్ దారుణంగా కుటుంబ సభ్యులతో సహా హత్యచేయబడతాడని, భుట్టోని ఉరితీస్తారని, నిక్సన్‌ని పత్రికలవాళ్ళు గద్దెనించి దింపుతారని, ఇందిరాగాంధీ ఎన్నికల్లో ఓడిపోతుందని ఎవ్వరనుకున్నారు.

మొగలాయి సామ్రాజ్యాన్ని నాశనంచేసి, చిట్టచివరి మొగలాయి చక్రవర్తి బహదూర్‌షాని రంగూన్‌లో జైళ్ళో పెడతారని తెలిస్తే జహంగీరు బ్రిటీష్‌వాళ్ళకి వ్యాపారం చేసుకోవడానికి అనుమతిచ్చేవాడేనా?....

చదువుతున్న పేపర్ని టేబిల్‌పైకి విసిరేవేడు చక్రవర్తి.

.... యాభైఏళ్ళ వయస్సులో, మనిషిరాయిలా వుండి ఇంట్లో పనంతా చేసుకునే అమ్మ హఠాత్తుగా మంచంలో పడుతుందని తానెప్పుడూ అనుకోలేదు...

అమ్మకి కాన్సరట....

అమ్మని కాన్సరు పూర్తిగా కొరుక్కుతిందని మొన్నటివరకూ తెలియదు. ఉస్మానియా హాస్పిటల్లో మూడ్నెల్లు వుంది. లాభం లేదని డిశ్చార్జ్ చేసారు.... అమ్మ కదలలేదు... అన్నీ మంచంలోనే... బెడ్‌పాన్ తను శుభ్రంచేస్తుంటే అమ్మ కళ్ళల్లో నీళ్ళు తిరుగుతాయి..... తనతో ఏదో చెప్పాలనుకుంటుంది....చెప్పలేదు.... కళ్ళు కన్నీటి వరదతో పొంగే నదుల్లా వుంటాయి....

ఏం చెయ్యగలడు తను?

ఆఫీసులో మ్యారేజ్ ఎడ్వాన్సని, మోటారుసైకిల్ ఎడ్వాన్సు అని డబ్బు తెచ్చి అమ్మ జబ్బుకే ఖర్చుచేసేడు.... నయంకాలేదు...

అమ్మ కడుపులో తనుండగానే నాన్న చనిపోయేడు. నాలుగేళ్ళ సంసార జీవితంలో అమ్మని నాల్గురోజులయినా సుఖపెట్టలేదట నాన్న.... నాయనమ్మ, నాన్న కలసి అమ్మని ఏడిపించేవాళ్ళు, నాన్న ప్రతి విషయానికి నాయనమ్మ సలహాయే తీసుకునేవాడట.... అమ్మతో పెద్దగా మాట్లాడేవాడు కాదట... అమ్మ పరిస్థితి పనిమనిషికన్నా హీనంగా వుండేదట...

నాన్న సినిమాకు వెళ్ళలంటే నాయనమ్మతో కలసివెళ్ళేవాడట. తలనొప్పి వస్తే అమ్మ అమృతాంజనం రాయబోతే కసిరికొట్టి, నాయనమ్మను తలరుద్దటానికి పిలిచేవాడట.

తల్లీ కొడుకుల మధ్య అనురాగం, ఆత్మీయత వుండటం సహజమేగాని మోతాదు మించితే చాలా ప్రమాదమనిపించింది చక్రవర్తికి. తల్లి నుంచి అన్ని విషయాలు తెలుసుకున్నాడు.

నాయనమ్మ నాన్నని ప్రసవించిన వెంటనే నాన్న బొడ్డు కోసేసి వుండరని అమ్మ అనుమానం. తనని ప్రసవించగానే వెంటనే బొడ్డు కోసెయ్యమని నర్సుకు చెప్పిందట ఆ మగతలోనే.

ఆ అనుభవాల మూలంగానే అమ్మ తనని దూరంగా వుంచేది. చుట్టుపక్కల పిల్లలు తన నెవ్వరన్నా కొట్టితే తననే మందలించేది. ఏ విషయంలోను తనకి సలహాలనిచ్చేది కాదు.

అమ్మ జీవితమంతా కష్టాలమయం.... సవితితల్లి ఆరళ్ళతో పుట్టినింట్లో అష్టకష్టాలు పడింది.... నాయనమ్మగారింట్లో కూడ అమ్మకి కష్టాలు తప్పలేదు.... జీవితం ఆఖరిపుటల్లో కూడ అక్షరాలన్నీ గజిబిజిగానే వున్నాయి...ఆఖరిక్షణాలు లెక్కపెట్టుకుంటూ, కూతురిచే చేయించుకోవాల్సిన పనులు తనచే చేయించుకుంటూ సిగ్గుతో, బాధతో క్షణక్షణం చచ్చిపోతూనే వుంది.....

"చక్రవర్తిగారూ! క్యాంటిన్‌కు రావడంలేదా?" – టైపిస్టు లక్ష్మణరావు అడిగేడు.

"ఆకలిగా లేదు... మీ రెళ్ళిరండి" అన్నాడు చక్రవర్తి.

అతనెళ్ళిపోయాడు.

తన కాకలిలేదా?.... ఉదయం కూడా భోజనం చెయ్యలేదు.... ఉదయం అన్నంవొండితే అంతా బియ్యపు గింజలే! అమ్మకి బత్తాయిరసమిచ్చి తను బయటపడ్డాడు.

.... నెలాఖరు.... డబ్బుల్లేవు... దాదాపు స్నేహితులందరి దగ్గర అప్పు తీసుకున్నాడు తను అమ్మ మందులకోసం.... ఎప్పుడు తీర్చాలో ఆ అప్పులు?

అమ్మ చనిపోతే....?

దహన సంస్కారానికి డబ్బులెవర్ని అడగాలి?

మళ్ళీ చేతిలోకి పేపరుతీసుకున్నాడు.

మంచంలో మగతగా పడుకున్న అమ్మేకనిపించింది.

"సార్! మీకు ఫోన్ వొచ్చింది" అటెండరు వొచ్చి చెప్పేడు.

పక్కనున్న ఒ.పి. సెక్షన్‌వైపు నడిచాడు చక్రవర్తి.

నడుస్తుంటే అతని గుండెలు దడదడ కొట్టుకున్నాయి.

అమ్మకి ఎలా వుందో?

ఇంటి ఓనరు రాఘవయ్య చెయ్యడం లేదుకదా?

"మీ అమ్మ చనిపోయిందని" చెప్పడు గదా! ఆయన మాట ఏలా భరించడం?

... జాతస్య మరణం ధృవమ్....

....పుట్టినవాడు గిట్టక తప్పదు.... ప్చ్

కానీ.... అమ్మ... అమ్మ...

తన కళ్ళముందు నుండి మాయమయిపోతుందా?

అమ్మ యింకా ఎక్కువ రోజులు బతకదని చెప్పినా తన మనస్థితి ఆ పరిస్థితికి తట్టుకోవడానికి సిద్ధంగా లేదు.

ఇప్పుడెలా?

అసహనంతో రిసీవర్ పైకెత్తాడు.

"హలోఁ!"

వసుమతి గొంతు విన్పించడంతో చక్రవర్తి మనస్సు కుదుటబడింది.

"చక్రవర్తిగారేనా?"

"వసూ... ఏమిటి సంగతులు?"

"నా మీద కోపం వొచ్చిందా?"

"ఎందుకు?"

"మా నాన్న ఉదయం నీ మీద విరుచుకుపడ్డాడట కదా?"

"..................."

"నాన్నకు కోపం ఎక్కువ.... నువ్వేమనుకోకు."

"నా కెవ్వరిమీద కోపంలేదు సుమా! కోపం వొచ్చినా నాకే నష్టం...." అన్నాడు చక్రవర్తి దిగులుగా.

"అదిగో నీ మాటలే చెబుతున్నాయి నీకు మా మీద కోపం పోలేదని.... మా నాన్న తరఫున నేను క్షమాపణలు చెబుతున్నాను."

"వసూ! మీ నాన్న పోట్లాట నాకేమన్నా కొత్తా? మామూలేగా.... మనస్ఫూర్తిగా చెబుతున్నాను.... నాకేం కోపం రాలేదు... అది సరేగాని మా అమ్మ దగ్గరకు వెళ్ళావా?... ఎలా ఉంది అమ్మకు?"- ఆతృతతో అడిగాడు.

"మామ్మకి తేలిగ్గానే వుంది.... కొంచెంసేపు మాట్లాడింది కూడ" తేలిగ్గా ఊపిరి పీల్చేడు చక్రవర్తి.

"చల్లటి వార్త చెప్పావు వసూ!"

"ఉదయం యింటి నుంచే వెళ్ళావు కదా! ఏమిటి అలా అడుగుతున్నావు."

"ఏం లేదులే! నాకు ఫోన్ చేశావు.... నాన్న లేడా ఏమిటియింట్లో?"

"నాన్న విషయం నీకు తెలుసుగా..... డబ్బు మనిషి... వడ్డీ డబ్బులు ఎగ్గొట్టేడట ఎవడో? వసూలుచేస్తానని అన్నం కూడ సరిగ్గా తినకుండా వెళ్ళాడు. సాయంత్రం నాన్న తిరిగిరాకుంటే బిర్లాభవన్ వెళ్ళదాం.... త్వరగా ఆఫీసు పని తెమల్చుకుని వచ్చెయ్యి."

వసుమతి ఫోను పెట్టేసిన శబ్దం వినిపించింది చక్రవర్తికి. వసుమతితో తేలిగ్గా మాట్లాడేసేడుగాని మనస్సు పీకుతూనే వుంది.

సాయంత్రం యింటికి వెళ్ళగానే ఆమె తండ్రితో మళ్ళీ పోట్లాట తప్పదు.

ఉదయం గాలివానలా రాఘవయ్య తనమీద దాడిచెయ్యడం గుర్తుకు వచ్చింది.

"రెండు రోజుల్లో ఇల్లు ఖాళీ చెయ్యాలి" అన్నాడు. ఉదయాన్నే వేపపుల్ల నములుతూ తాముంటున్న షెడ్డువైపు వొచ్చి,

రాఘవయ్యగారి మేడ వెనుక భాగంలో వున్న రేకుల షెడ్డులోనే తాముంటున్నది. రెండేళ్ళయ్యింది ఆ యింట్లోకి వొచ్చి. రెండేళ్ళలో ఆరుసార్లు అద్దెపెంచాడు. ఆ మాత్రం సౌకర్యం వున్న యిల్లు దొరుకుతుందో లేదోనని కిక్కురుమనకుండా అద్దె కట్టేసేవాడు తను. కలుపుగోలుగా మాట్లాడుతూ ఆసరాగా వుండే రాఘవయ్య కూతురు వసుమతిని వొదిలి దూరంగా ఉండటం అమ్మకీ ఇష్టంలేదు.

"వున్న ఫళాన ఇల్లు ఖాళీ చెయ్యమంటే కష్టం గదండీ! అద్దె మీరడిగినట్లే యిస్తున్నాగా!" రాఘవయ్య యిల్లెందుకు ఖాళీ చెయ్యమంటున్నాడో అర్థంకాలేదు తనకి.

"మీ అమ్మ ఎక్కువ రోజులు బతకదట కదోయ్! మా యింటిముందు 'శవం' లేవడం యిష్టంలేదు మా యింటికి అరిష్టంకూడ.... మా యింటిముందు శవం చూడడం నాకు చాలా భయం. వెంటనే ఖాళీ చెయ్యి" మొహం నిండా అసహ్యం పులుముకుని అన్నాడు రాఘవయ్య.

తోటిమనిషి చావు బతుకుల్లో వుంటే సానుభూతి, జాలి చూపించడానికి బదులు రాఘవయ్య కర్కశంగా మాట్లాడటం చక్రవర్తికి గుండె తరుక్కుపోయింది.

"హైద్రాబాద్‌లో మరో ఇల్లు దొరకాలంటే కనీసం రెండు నెలలన్నా గట్టి ప్రయత్నం చేస్తేగాని దొరకదండీ! ఖాళీ చెయ్యమని యిప్పుడు చెప్పారుగా! ఆ ప్రయత్నంలోనే వుంటాను."

"అదేం కుదరదయ్యా! రెండు నెలలంటే ఈ లోపు మీ అమ్మ గుటుక్కుమంటుంది. నా కొంప మునుగుతుంది. కొత్తగా కట్టిన యింటిముందు శవం లేవడం అరిష్టమయ్యా అని మొత్తుకుంటుంటే వినవేమయ్యా!" అన్నాడు విసుక్కుంటూ.

వసుమతి మధ్యలో కల్పించుకోబోతే కసిరికొట్టాడు రాఘవయ్య.

ఆయనతో ఎక్కువసేపు మాట్లాడటం మనస్కరించక ఆఫీసు కొచ్చేసేడు తను.

రాఘవయ్యకు వసుమతి ఒక్కతే సంతానం. వసుమతి తల్లి చనిపోయి పదేళ్ళయింది. యింట్లో వంటా వార్పు అంతా వసుమతే చూడటంతో ఆమె చదువు కుంటుపడింది. పదో తరగతి వరకు చదివి మానేసింది. 'రాఘవయ్య మానిపించేసాడు' అంటే బాగుంటుంది. పుస్తకాలు చదువుతూనో, అల్లికలతోనో, స్నేహితులతో మాట్లాడుతూనో కాలక్షేపం చేస్తుంది వసుమతి.

వసుమతికి ఇరవైయ్యేళ్ళుంటాయి, గుండ్రటి మొహం, సోగకళ్లు, గులాబీ రేకుల్లాంటి పెదవులు, పొడవాటి జడ, డబ్బపండులాంటి శరీరచ్ఛాయ– కళకళలాడుతూ వుంటుంది.

ఆ అమ్మాయికి తనంటే ఎంతో యిష్టం–

ఆ రోజు తనకింకా గుర్తుంది– జీవితంలో మర్చిపోలేని మధురమైన రోజు– ఇంటి అద్దెయివ్వడానికి రాఘవయ్యగారి మేడవైపు నడిచేడు తను.

ఇంట్లో రాఘవయ్య లేడు.

వసుమతి తలుపులు తీసింది.

రోజూ చూపులతోనే తన మనసు దోచుకునే ఆ అమ్మాయి ఎదురుగా నిలబడాగనే తడబడ్డాడు తను.

తన ఎడారిలాంటి జీవితంలో ఆ అమ్మాయి 'ఒయాసిస్సు'లా తారసిల్లింది.

మనస్సును, శరీరాన్ని స్వాధీనంలోకి తెచ్చుకునేసరికి ఐదు నిమిషాలు పట్టింది తనకి.

"రాఘవయ్యగారు లేరాండీ యింట్లో"

ఆయన లేడని తెలుస్తున్నా అడిగేడు తను.

కళ్ళార్పకుండా తననే చూస్తున్న వసుమతి కనురెప్పలు తన మాటలకు ఉలిక్కిపడ్డాయి.

"రండి.... లోపలికి రండి"- సోఫా చూపించి లోపలికి పరుగెత్తింది.

రావిశాస్త్రి 'అల్పజీవి' కన్పించేను సోఫాపై.

ప్రకృతి దృశ్యాలున్న కలర్ పెయింటింగ్స్ గోడలకు వేలాడదీసి వున్నాయి.

ఆమెకు మంచి టేస్టులున్నాయనుకున్నాడు చక్రవర్తి.

చిక్కని పాలల్లో బోర్నవీటా కలుపుకొచ్చింది.

"నేను వస్తాదును కావాలనుకుంటున్నారేమిటి?" అన్నాడు పాలకప్పును చూస్తూ.

ఆమెతో ఎన్నో సంవత్సరాల పరిచయమున్నవాడిలా మాట్లాడటం తనకే ఆశ్చర్య మేసింది.

"బలహీనంగా కన్పిస్తున్నారు మీరు. కొంచెం లావయితే యింకా బావుంటారు" అంది తనవంకే చూస్తూ.

ఆమె తనకు ఆత్మీయురాల్లా తోచింది.

ఎన్నో జన్మల పరిచయమున్నట్లనిపించింది తమ మధ్య. ప్రేమాంకురాలు గుండెల్లో బలంగా నాటుకున్నప్పుడలాగే అన్పిస్తుంది గాబోలు!

"ఇంటి అద్దె ఇవ్వడానికి వచ్చేనండీ."

"ఆ విషయాలు నాన్నతో మాట్లాడండి... నాన్న లేడు.... సికింద్రాబాద్ వెళ్ళేడు."

సోఫాలోంచి లేవబోయేడు తను.

"నాతో మాట్లాడటానికి యింకే విషయాలు లేవా?" అంది నవ్వుతూ.

ఎంత చొరవ.....

"... ఎన్నో విషయాలున్నాయి..... వెన్నెల రాత్రుల్లో నీ వొడిలో తలపెట్టుకుని యుగాంతంవరకూ సరిపడే విషయాలు చెప్పాలి... గుండెల్లో 'కొలెస్ట్రాల్'లా పేరుకుపోయిన కష్టాల్ని తుడిచేసేసి, నీ ప్రేమనే వెచ్చని వూపిరిని నింపుకోవాలి....

మనస్సే ఆమెతో కొన్ని నిముషాలు మాట్లాడింది.

పెదవుల కదలికలు లేవు.

చీకట్లో వెన్నెల కిరణంలా కన్పించింది వసుమతి ఆ క్షణంలో.

"నే నంటే మీ కిష్టమేనా?" అంది మెల్లగా, ధైర్యంగా.

"...."

"మీతో జీవితం పంచుకోవాలని వుంది" అంది తలొంచుకుని.

విచ్చీ విచ్చని సన్నజాజిలా కన్పించిందామె. ఆమె తల్లోని సన్నజాజులు తన పిరికితనాన్ని చూసి నవ్వేయి.

"సన్నజాజులంటే నాకెంతో యిష్టం" అన్నాడు తను లేచి నిలబడి.

ఆమె నవ్వింది, సన్నజాజి విచ్చుకుని నవ్వినట్లు.

"చక్రవర్తిగారు! ఇదిగోండి 'టపాల్ బుక్'.... మీ పేపర్స్ తీసుకుని పి.ఆర్.లో రిజిష్ట్రేషన్ చేసుకోండి"

సెక్షన్ ఆఫీసరు మాటలతో చక్రవర్తి మనస్సు వసుమతి దగ్గరనుంచి ఆఫీసులోకొచ్చి పడింది.

ఐదింటివరకు 'ఫైల్స్'తో కుస్తీపట్టి ఆఫీసు నుంచి బయటపడ్డాడు చక్రవర్తి.

సిటీబస్సు దొరకలేదు.

ఇంటివైపు నడవసాగేడు.

జీవితమే వొక 'క్రాస్‌వర్డ్ పజిల్లా' తోచింది చక్రవర్తికి.

గుమ్మడిపాదులా మెదడు చుట్టూపాకిన సమస్యలు.

చావుబతుకుల్లో అమ్మ.....

దహన సంస్కారాలకు డబ్బులు.....

అద్దెకు మరో యిల్లు.....

వసుమతి తనకి కనపడకుండా రాఘవయ్య కట్టడి...

ఆఫీసులో కనబడని 'జీ.ఓ'ల కోసం వేట....

....క్రాస్‌వర్డ్ పజిల్లో కొన్ని సమస్యలకు వెంటనే పరిష్కారం దొరుకుతుంది. మరికొన్ని చిక్కుప్రశ్నల్లా మిగిలిపోతాయి....

ఇంటిదగ్గరకొచ్చేశాడు చక్రవర్తి.

రాఘవయ్య మేడముందు గుంపులు గుంపులుగా జనం కన్పించేరు.

చక్రవర్తికి చెమటలు పట్టాయి.

కళ్ళలో నీళ్లు తిరిగేయి.

....అమ్మ.... అంతా అయిపోయింది...

....అమ్మ... ప్చ్....

జనాన్ని తోసుకుని ముందుకెళ్ళాడు.

ఏడుస్తూ వసుమతి కన్పించింది.

శవంవైపు చూసేడు చక్రవర్తి.

కరెంటు షాక్ తిన్న వ్యక్తిలా నిర్విణ్ణుడయ్యాడు.

రాఘవయ్యశవం!!

గుండెపోటుతో కొత్త మేడముందే చనిపోయేడు రాఘవయ్య.

– 'యువ' మాసపత్రిక, జూన్ **1981**